


గొడుగు గొడవ

ఈ వర్షాకాలంలో గొడుగులకు డిమేండెక్కువని అంటారేగాని ఎండల్లోకూడా గొడుగులవసరం చాలా వుంది. ఆ మాటకొస్తే పూర్వ కాలంలో గొడుగు అన్ని సీజన్లలోనూ చేతిలో వుండి తీరేదట. రైల్లో వెళ్ళినా, బస్సెక్కినా, బండిలో వచ్చినా గొడుగు చేత్తో పుచ్చుకుంటే ఆ రోజుల్లో అదొక ఘనత. ఇప్పుడు దానిఖర్మ కాలిపోయింది గనక, ఇంట్లో పడి ఏడుస్తుందిగాని పూర్వం దానిదే రాజ్యం. గొడుగుని ఏ దేశస్థులు కనుక్కున్నారో నాకు తెలీదు. ఛాంబర్లేన్‌గారు అంబరిల్లా లేనిదే అడుగు బయటపెట్టే వారు కాదని పాత రికార్డులు తిరగేస్తే సుబ్బరంగా అర్థమవుతుంది. ఆయ నెంత సుతారంగా వుండేవారో....సదరు గొడుగునికూడా అంత అపురూపం

గానూ చూసుకునేవారని చరిత్ర చెబుతోంది. మనిషికి లాగు, చొక్కాలెట్లాంటివో బెర్నార్డ్‌షాగారికి గొడుగట్లాంటిది. గొడుక్కిచ్చిన విలువ తన దుస్తులకిచ్చేవారు కాదుట. లింకన్ మహాశయుడి గొడుగు గురించి ఒకానొక కథ ప్రచారంలో వుంది.

అప్పటికి లింకన్ అమెరికా అధ్యక్షుడు కాలేదు. ఒకానొక వర్షం రోజు మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురుస్తోంది. లింకన్‌గారి చేతిలో ఎప్పటి మాదిరే గొడుగుంది. తన పక్కనున్న అనుచరుడికి గొడుగిచ్చేసి వెళ్ళిపొమ్మన్నాడు. మరి మీరు ఎట్లా వెడతారని అనుచరుడు అడిగేడు. గుర్రబ్బండిలో వెడతానని చెప్పి బండెక్కేసేడు లింకన్. లింకన్‌గారి గొడుగు తన చేతికి వచ్చినందుకు ఆ అనుచరుడు ఎంతగానో ఆనందిచ్చేడుట. అయ్యో, అమ్మో అని ఎంతో మురిసిపోయేడుట. అయ్యా .... ఆ రోజులన్నీ గొడుగు పాలిట బంగార్రోజులు. గొడుగు ప్రిస్టేజ్ సింబల్. మనిషి హోదాని పెంచే పనిముట్టు. అంతవరకూ ఎందుకు? మన గాంధీగారు సైతం గొడుగుని సోదర వాత్సల్యంతో చూసుకొనేవారని చెప్పుకుంటారు. చరిత్ర పుటలను యింకా వెనక్కి తిప్పితే గొడుగు పవరేమిటో బాగా అర్థమవుతుంది. అలనాటి గ్రీకు దేశస్థులు, రోమ్ నగర వాసులు ఆడవాళ్ళకిచ్చే ఆధిక్యతను గొడుక్కూడా యిచ్చేవారు. ఆడదెంతో, గొడుగు కూడా అంతేనన్నమాట! బాబిలోనియా బానిసలు సరేసరి. గొడుగు కనిపిస్తే చాలు, గజగజా వణికేవారు. గొడుగుని తాకేందుకు అదిరి చచ్చేవారు. స్పెయిన్ అధికారులూ.....వెన్నీస్ ప్రజలూ గొడుగుని కళ్ళ కద్దుకునేవారు. ఎంతైనా నీడనిచ్చే కిరీటం కదా! ఆపాటి మర్యాదా తప్పదు.

గొడుగుయొక్క ఘనాపాటితనం అట్లా అట్లా పెరిగి డికెన్స్ వరకూ వచ్చింది. డికెన్స్ కాలంలో గొడుగు ఒక ఫేషన్‌గా చలామణీ అయ్యింది. అంతే! అక్కడితో దాని దశకి తిలోదకాలివ్వడం జరిగింది. నీడనిచ్చే గొడుగు కంటే గొడుగులో వున్న మనిషే ముఖ్యమని డాక్టర్ జాన్సన్

గారి రోజుల్లో తేలిపోయింది. యుద్ధం ముందు రోజుల్లో గొడుగు గిరాకీ బాగా తగ్గిపోయింది. అలాంటి దిప్పుడు గొడుగు పేరెత్తితే చిరాకు పడిపోతు న్నారు జనం. కుర్రాళ్ళ సంగతి సరేసరి. గొడుగుని గొంగళి పురుగు మల్లే చూస్తున్నారు. రోత, అసహ్యం పెంచుకుంటున్నారు.

ఉన్నట్టుండి గొడుగు పురాణం ఎత్తుకున్నందుకు కారణం లేక పోలేదు. మొన్న సెలవు రోజున వర్షం దంచేస్తుంటే, ఇంట్లో కూచున్న నాకు సిగరెట్ కాల్చాలనిపించింది. మా పెద్దవాడికి డబ్బులిచ్చి సిగరెట్లు పట్టుకు రమ్మన్నాను. వర్షంగదాని వంక పెట్టేడు. గొడుగు తీసుకెళ్ళమన్నాను. ఆ పేరు వినగానే ఛీ! అన్నాడు. పద్నాలుగేళ్ళు నిండలేదు వాడికి. వాడికేం తెలుసు గొడుగు గొప్పదనం.

అందుచేత పైన చెప్పిన చరిత్రంతా వాడికి చెప్పేను. అప్పటికైనా గొడుగుని గౌరవిస్తాడనుకున్నాను. ఉహుఁ.... అంత వర్షంలో సగం తడిసిపోయి సిగరెట్లు తీసుకొచ్చేడేగానీ గొడుగు ముట్టుకోలేదు భడవ. గొడుగు మోసుకెడితే నామర్దా అనుకుంటున్నాడో, ఏమో మరి.

మా కాలేజీలో గోపాలంగారని మాకో లెక్చెరరు వుండేవారు. అందరికి పెట్టినట్టే ఈయనకూ్కడా మేమొక నిక్‌నేమ్ ఖాయం చేసేం. స్టూడెంట్స్ గొడుగని పిలిస్తే, ప్రొఫెసర్లు గొడుగు గోపాలంగారని పిలిచే వారు. ఇంకో ఏడాదిలో రిటైరయ్యే వయసు. కానీ అట్లా కనిపించేవారు కాదు. నవనవలాడుతూ కనిపించేవారు. నవ్వుతూ, ధీమాగా వుండేవారు. దానిక్కారణం ఆయన చేతిలో వుండే గొడుగేనని మా కంటే ముందరే మా సీనియర్లు కనుక్కున్నారు. ఆయన పెర్సనాలిటీకీ, గొడుగుకీ సంబంధమేమిటని మీరడ గొచ్చు, వుంది.

ఆయన్నంటి పెట్టుకు తిరిగే ఆ ఘనమైన గొడుగుని .... ఆయన చదువుకునే రోజుల్లో ఎవరో పిల్ల ప్రేమ కానుకగా ప్రెజెంట్ చేసిందట.

ఆ రోజు లగాయితూ ఆయనకా గొడుగు ఆరోప్రాణమై పోయింది. గొడుగు లేనిదే అడుగు పెట్టేవారు కాదు. రాత్రిళ్ళు సైతం తనతో వుండేది గొడుగు. రాత్రిళ్ళెందుకు మేష్టారూ అని అడిగితే కుక్కలవీ మీదపడకుండా ఇది కర్రలాగా ఉపయోగపడుతుందోయ్ అనేవారు. నిజానికి ఆ గొడుగులో ఆయన తన ప్రేమని చూసుకునేవారు. గొడుగు విప్పగానే చిన్ననాటి ముచ్చట్లు .... గత వైభవం, మనసంతా చోటు చేసుకునేవి కాబోలు....ఆ గొడుగు కింద అరమోడ్పు కళ్ళతో ఎంతో ఆనందంగా అవన్నీ నెమరేసుకుంటూ, అంత వయస్సులోనూ కుర్రాడికి మల్లే ధీమాగా నడిచేవారు. ఈ గొడుగవతారం చూసి ఎవరు నవ్వుకున్నా పట్టించుకునే వారు కాదు. ఆ పిల్ల ఎవరోగాని పుస్తకమో, పెన్నో, ఉంగరమో కానుకగా ఇచ్చివుంటే బావుండేది. గొడుగిచ్చి గొడవ చేసింది.